చేతినిండా పని !


పరిగి మండలం విట్టాపల్లిలో ఉపాధి పనుల్లో నిమగ్నమైన కూలీలు (ఫైల్)

- 2023–24 ఆర్థిక సంవత్సరంలో జోరుగా ఉపాధి పనులు
- హిందూపురం క్లస్టర్‌లో 12.68 లక్షల పనిదినాలు పూర్తి
- అదనపు పనిదినాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఈ ఏడాది నుంచి రూ.300 కూలీ
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

2023-24లో లక్ష్యాన్ని పూర్తి చేసిన మండలాలు

మండలం	జాబ్ కార్డులు	కల్పించిన పనిదినాలు	చేసిన పనిదినాలు
చిలమత్తూరు	5,919	2,18,000	1,24,664
లేపాక్షి	4,993	1,76,000	1,77,304
పరిగి	6,058	2,24,000	2,24,487
సోమందేపల్లి	6,020	2,19,000	2,19,734

హిందూపురం అర్బన్: ఉన్న ఊరిలోనే మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తుండటంతో కూలీలు సంతోషంగా పనులు చేసుకుంటున్నారు. హిందూపురం క్లస్టర్ పరిధిలో అడిగిన వారందరికీ పనులు కల్పించడంతో 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యానికి చేరువయ్యారు. చేతినిండా పని దొరకడంతో కూలీలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'పురం' పరిధిలో 40,696 జాబ్‌కార్డులు

2023–24 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన పని దినాలకు తోడు రాష్ట్ర ప్రభుత్వం అదనపు పని దినాలు కల్పించింది. హిందూపురం క్లస్టర్ పరిధిలో 40,696 జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. 2023–24లో 14.84 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో 12.68 లక్షల పనిదినాలు చేశారు. క్లస్టర్ పరిధిలోని ఆయా మండలాల పరిధిలో వ్యవసాయ పొలాలకు రహదారులు, చెరువు కుంటలు తవ్వకం, గట్లు వేయడం తదితర పనులు చేశారు. కొన్ని చోట్ల ఎన్ఆర్‌జీఎస్ కింద మామిడి, నిమ్మ, సపోటా, జామ తదితర పండ్ల తోటల పెంపకం చేశారు. ఫారంపాండ్స్ పనులు కూడా పూర్తి చేశారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఆయా పనులు కేటాయించి పనులు పూర్తి చేస్తూ వచ్చారు. అత్యధికంగా క్లస్టర్ పరిధిలో లక్ష్యానికి మించి పరిగిలో 2.24 లక్షల పనిదానాలు టార్గెట్ నిర్ణయించగా.. 2,24,487 లక్షల పనిదినాలు పూర్తిచేశారు. లేపాక్షి మండలంలో 1.76 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్ణయించగా 1,77,304 పనిదినాలు చేశారు. సోమందేపల్లిలో 2.19 లక్షల పనిదినాలుగా నిర్ణయించగా.. 2,19,734 పనిదినాలు చేశారు. పెనుకొండలో 1.88 లక్షల పనిదినాలు నిర్ణయించగా..1,74,736 పనిదినాలు చేశారు.

అక్రమాలకు తావులేకుండా..

ఉపాధి హామీ పథకంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా అధికారులు పకడ్బందీగా పనులు కల్పిస్తున్నారు. పనుల గుర్తింపు మొదలు డబ్బు చెల్లింపు వరకూ ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేసేలా విధివిధానాలు రూపొందించారు. ఉపాధి పథకంలో అన్ని రకాల పనులు ఒకేసారి చేయకుండా ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన పనుల్లో కొన్ని పనులు మాత్రమే చేసేలా యాప్‌లో నిబంధన విధించారు. బినామీ మస్టర్లకు తావు లేకుండా హాజరు విధానాన్ని పకడ్బందీగా అమలు చేశారు. మస్టర్‌లో అటెండెన్స్ వేసిన వెంటనే సెల్‌లో ప్రత్యేక యాప్ ద్వారా పని ప్రదేశంలో కూలీ ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. మళ్లీ నాలుగు గంటల తరువాత అదే కూలీని మరోసారి ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో ఉపాధిలో అక్రమాలకు చెక్ పడింది.

కూలీ రూ.300కు పెంపు

ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఉపాధి హామీ కూలీలకు దినసరి వేతనం పెంచారు. ఇప్పటి రూ.272 ఇస్తుండగా ఇకపై రూ.300 ఇవ్వనున్నారు. దీంతో కూలీలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి పనులతో ఊరట



ఉపాధి పనుల్లో భాగంగా 2023–24 సంవత్సరంలో చెరువుల్లో పూడిక తీత, గట్లు వేయడం, ఉద్యాన పంటలకు సంబంధించి వివిధ పండ్ల మొక్కలు నాటే పనులకు వెళ్లాను. రోడ్డు పక్కల మొక్కలు నాటాం. వంద పనిదినాలు కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.300 చేయడంతో మరింత సంతోషంగా పనులు చేస్తాం.
– శివప్ప, సంజీవరాయనపల్లి, చిలమత్తూరు మండలం

అడిగిన వారందరికీ పని



2023–24 ఆర్థిక సంవత్సరంలో నా క్లస్టర్ పరిధిలో అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాం. సకాలంలో వేతనాలు అందించేందుకు కూడా చర్యలు తీసుకున్నాం. ప్రధానంగా ప్రజోపయోగ పనులకు ప్రాధాన్యత ఇచ్చాం. ఎక్కడా వలస అన్న మాట వినపడకుండా పనులు కల్పిస్తున్నాం.
– శివానందనాయక్, ఏపీడీ, హిందూపురం

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటేయండి


వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్


టీడీపీ వర్గీయులకు కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

- మంత్రి ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖా మంత్రి , వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ తెలిపారు. మంగళవారం మండలంలోని కొల్లకుంట గ్రామంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలని కోరారు. జగనన్న ముఖ్యమంత్రి అయితేనే వలంటీర్ వ్యవస్థ ద్వారా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. చంద్రబాబు అబద్ధపు హామీలను నమ్మి పొరపాటున ఓటేస్తే సంక్షేమ పథకాలు రద్దు చేస్తారని స్పష్టం చేశారు. అందుకే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మాటలు నమ్మవద్దని సూచించారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన వెంటనే తిరిగి ఇంటికే వలంటీర్లు పింఛన్లు తెచ్చిఇస్తారన్నారు. వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, సర్పంచులు కిష్టప్ప, సోము, మాజీ సర్పంచులు రమాకాంత్‌రెడ్డి, కంబాలప్ప, నాయకులు రామాంజి, మల్లికార్జున చంద్రప్ప, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

మండలంలోని మండ్లి గ్రామంలో టీడీపీకి చెందిన అనీల్, పుష్ప, లింగారెడ్డి, కొల్లకుంటలో రామప్ప, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గిరియప్ప మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ గెలుపునకు కృషి చేయాలని, అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎల్లారెడ్డి, సజ్జారెడ్డి, నరసింహమూర్తి, ఈశ్వర్‌రెడ్డి, జగదీష్, కళ్యాణ్, ఆర్‌స్రెడ్డి, కుళ్లయప్ప తదితరులు పాల్గొన్నారు.

అందరికీ మేలు జరగాలి

పెనుకొండ: ఉగాది పర్వదినం నుంచి ప్రజలందరికీ మేలు జరగాలని దేవుడిని వేడుకున్నట్లు మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం తన స్వగృహంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలంటే జగనన్న మరోసారి అధికారంలోకి కచ్చితంగా రావాలన్నారు.

జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి సాధ్యం


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి సాధ్యం. అవి నిరిఘ్నంగా కొనసాగాలంటే మరోసారి ప్రజలంతా ఈ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేయాలి' అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప కోరారు. మండలంలోని ఫళారం గ్రామంలోని లక్కమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఫళారం, పీఎస్ పాళ్యం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ సీఎం జగన్ నెలకొల్పిన సచివాయ వ్యవస్థ వల్ల ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లో ఉచితంగా అందుతున్నాయన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. వచ్చే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి శాంతమ్మతో పాటు తననూ గెలిపించాలని కోరారు. మాజీ సర్పంచ్ రామిరెడ్డి, ఎంబీ నాగరాజు, నాయకులు పుట్టబసప్ప, జగదీష్, బసవలింగప్ప, మలికార్జున్, విశ్వేశ్వర్, హనుమంతి, బండయ్య, మణి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదల ఆశాజ్యోతి 'విన్సెంట్ ఫెర్రర్'


'విన్సెంట్ ఫెర్రర్' చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ) వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని ఫళారం గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప... విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, పేద ప్రజలకు విద్య, వైద్య తదితర రంగాల్లో ఆయన సేవలందించారని కొనియాడారు. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లులో ఆర్డీటీ ఆస్పత్రులు ఏర్పాటు చేసి వేలాది మందికి వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. పేదల పాలిట ఆశాజ్యోతి అయ్యారని, 'అనంత' ప్రజల హృదయాల్లో 'ఫాదర్' గా స్థిరపడిపోయారన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని ఆర్.వద్రహట్టి గ్రామంలో మంగళవారం ఆర్డీటీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏటీఎల్ ఓబులేసు మాట్లాడుతూ ఆర్డీటీ ద్వారా పేద ప్రజలకు అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ప్రజలకు సూచించారు. అనంతరం స్పందించు–సాయం అందించు కార్యక్రమంలో భాగంగా విరాళాలు అందించేందుకు హుండీలను అందజేశారు.

నేడు జ్యోతుల ఉత్సవం


అలంకరణలో దొడ్డీరమ్మదేవి

రొళ్ల: మండల పరిధిలోని దొడ్డేరి గ్రామ సమీపంలో వెలసిన దొడ్డీరమ్మదేవి జ్యోతుల ఉత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఏడాది ఉగాది పర్వదినం మరుసటి రోజు అమ్మవారికి జ్యోతుల ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఒక రోజు ముందే ఆలయాన్ని మామిడి తోరణాలు, పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. దొడ్డేరి, కొత్తపల్లి, పిల్లిగుండ్ల, రంగనపల్లి, వెంకటంపల్లితో పాటు అమ్మవారిని కొలిచే కర్ణాటక ప్రాంతాలకు చెందిన భక్తులచే అమ్మవారికి జ్యోతుల ఉత్సవాలు నిర్వహించనున్నారు.

పూల ధరలకు రెక్కలు


అమరాపురంలో పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం పూల మార్కెట్‌లో పూల ధరలకు రెక్కలొచ్చాయి. సాధారణంగా బారు (నాలుగు మూరాలు) రూ.50 నుంచి 100 పలికేది. అయితే మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా పూలకు డిమాండ్ ఏర్పడింది. మార్కెట్లో ఏ పూలు అడిగినా బారు రూ.250 నుంచి 300 వరకూ ధరలు పలికాయి. మరో వైపు అరటి పండ్లు కూడా డజన్‌కు రూ.60 నుంచి 70 దాకా పలికాయి.

ముగ్గురి అరెస్టు

రొళ్ల: మండల పరిధిలోని ఆర్.వద్రహట్టి గ్రామ సమీపంలోని జూద కేంద్రంపై మంగళవారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.3,100 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్రోధి నామ సంవత్సర తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

హిందూపురం: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్‌ను వైఎస్సార్ సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాలరెడ్డి ఆవిష్కరించారు. రహమత్‌పురం కోల్డ్‌స్టోరేజీలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి ఇందూ జ్ఞాన వేదిక ముద్దిరెడ్డిపల్లి కమిటీ అధ్యక్షుడు ఆదినారాయణ, సింధు, జ్యోతి, మోక్ష, కోనమ్మ, తేజస్విని, నాగమ్మ రామ్మోహన్, సుబ్బమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.


హిందూపురం: పేట వెంకటరమణస్వామి ప్రాకారోత్సవం


హిందూపురం: అలంకరణలో గుడ్డం రంగనాథస్వామి


హిందూపురం: సూగురు ఆంజనేయస్వామి


హిందూపురం మండలంలోని కొటిపి చౌడేశ్వరీదేవి


పెనుకొండ: మహేశ్వరిపీఠంలోని మహేశ్వరిదేవి

సంబరంగా ఉగాది

సాక్షిబృందం: తెలుగు వారి తొలిపండుగ ఉగాది సందర్భంగా హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లోని దేవాలయాలకు భక్తులు క్యూ కట్టారు. అనంతరం ఇళ్లలో ఉగాది పచ్చడి చేసుకొని ఇంటిల్లిపాదీ తిన్నారు.
దుకాణాలు, వ్యాపార కేంద్రాల్లో లక్ష్మీదేవి పూజలు చేశారు.


రొద్దం: పంచాంగ శ్రవణం వినిపిస్తున్న అర్చకుడు గిరీష్‌స్వామి


గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లిలో మారెమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



మడకశిర మండలం చెందకచెర్ల ఆంజనేయస్వామి ఆలయానికి తరలివచ్చిన భక్తులు


అమరాపురం: ఉగాది సందర్భంగా చోళమాంబదేవికి ప్రత్యేక పూజలు చేసిన దృశ్యం


రొళ్ల మండలం కొత్తపాళ్యం వెంకటేశ్వరస్వామి


అగళి మండలం మధూడి వీరభద్రస్వామి

వైభవంగా చౌడేశ్వరీదేవి రథోత్సవం


భక్తుల మధ్య సాగుతున్న చౌడేశ్వరీదేవి బ్రహ్మరథోత్సవం


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నవీన్‌నిశ్చల్, నాయకులు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రంలో వెలసిన చౌడేశ్వరీదేవి బ్రహ్మ రథోత్సవం మంగళవారం అశేష భక్తజనం మధ్య వైభవంగా జరిగింది. ఉదయమే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని అర్చకులు దేవాలయం చుట్టూ ఊరేగింపు చేశారు. తర్వాత ఉత్సవ విగ్రహాన్ని బ్రహ్మరథోత్సవం వద్దకు తీసుకువచ్చి మహా మంగళ హారతి ఇచ్చారు. దేవాలయం నుంచి గ్రామంలోని పంచాయతీ ఆవరణలోని ఆంజనేయస్వామి దేవాలయం వరకూ రథోత్సవం సాగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ రథోత్సవానికి హాజరై అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అదే విధంగా భక్తులకు అన్నదానం, పానకం, పెసర బ్యాళ్లు, మజ్జిగను పంపిణీ చేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నారాయణస్వామి, జిల్లా రైతు సంఘం నాయకుడు గోపాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రొద్దం: మండల కేంద్రం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం పెనుకొండ – పావగడ ప్రధాన రహదారిపై ఈద్గా వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని ఆర్ కుర్లపల్లి గ్రామానికి చెందిన దినేష్, కర్ణాటక కొడిమొడుగు గ్రామానికి చెందిన నరసింహులు గాయపడ్డారు. వారిని హుటా హుటిన పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సాహిత్యం సమాజానికి ఉపయోగపడాలి



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న కవి, రచయిత సడ్లపల్లి చిదంబరరెడ్డి

హిందూపురం టౌన్: సాహిత్యం సమాజాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని కవి, రచయిత సడ్లపల్లి చిదంబరెడ్డి అన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని మంగవారం సాయంత్రం స్థానిక అల్‌హిలాల్ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మేళనానికి కవి శౌంతి జయప్రకాష్ అధ్యక్షత వహించరు. ముఖ్యఅతిథిగా సడ్లపల్లె చిదంబరరెడ్డి, ఉపన్యాసకులుగా ఎంఈఓ గంగప్ప పాల్గొన్నారు. కవిసమ్మేళనంలో పలువురు కవులు, రచయితలు పాల్గొని మాట్లాడారు. సాహిత్యం మానవీయవిలువలు పెంపొందించే దిశగా ఉండాలన్నారు. అలాగే సమాజంలోని మూఢనమ్మకాలను పారద్రోలి సమాజ పురోగతికి సాహిత్యం ఉపయోగపడాలని సూచించారు. అనంతరం పలువురు కవులు వినిపించిన కవితలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ ఈటీ రామ్మూర్తి, రామకృష్ణ, ఉదయ్ కిరణ్, కల్లూరు రాఘవేంద్రరావు, అశ్వర్థనారాయణ, రామప్ప, ఓబులేసు, కొడిగేపల్లి సూర్యనారాయణ, పెన్నయ్య, గంగాధర్ తదితరులు పాల్గొని కవితలను వినిపించారు.

జూదరుల అరెస్ట్

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని మంగాపురంలో మంగళవారం పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో వ్యూహాత్మకంగా దాడి చేసి 15 మందితో పాటు 52 పేక ముక్కలు, రూ. 67 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రేపటి నుంచి ఇంటింటి ప్రచారం

రొళ్ల: మండల పరిధిలోని హొట్టేబెట్ట, బీజీ హళ్లి, మల్లినమడుగు పంచాయతీల్లో గురువారం, ఎం.రాయాపురం, రొళ్ల, హులికుంట పంచాయతీలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమానికి అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయాల కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.